# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-03-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అవినీతికి తావు లేకుండా రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు.
- ❖ మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- ❖ రాష్ట్రంలోని 10 జిల్లాలలో హెచ్‌పీవీ టీకా పంపిణీ ఈరోజు ప్రారంభమైంది.
- ❖ ఒంటిమిట్ట కోదండరామ స్వామి వారి ఆలయంలో ఈనెల 26 నుంచి ఏప్రిల్ 5 వరకు శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం కొత్తబురుజులో ఈరోజు పర్యటించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని రైతులతో మాట్లాడారు. ఆ తరువాత పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రైతులకు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం ప్రజావేదికలో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. రాష్ట్రానికి పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయని, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతపురంలో ఏరో స్పేస్ సిటీ ఏర్పాటుని తెలియజేశారు. భగీరథుని స్ఫూర్తితో రాయలసీమలో ప్రతీ ఎకరాకు నీళ్లివ్వాలనేది తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. రాయలసీమ ఉత్పత్తులకు ప్రచారం కల్పించి మెరుగైన రకాలు ఇక్కడ సాగు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అవినీతికి తావు లేకుండా కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. రైతుల సమక్షంలోనే భూమి కొలతలు తీసుకుని వారి ఆమోదంతో QR కోడ్ తో పాటూ సమగ్ర వివరాలతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ…

(వాయిస్ 29 సెకన్లు)

=====================

మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలోని క్యాంపు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో మహిళలకు అవసరమైన జ్ఞానం అందించడం, విలువ ఆధారిత ఉత్పత్తులు (వాల్యూ యాడెడ్ ప్రోడక్ట్స్) తయారీలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండలంలో ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. మత్స్యకారులకు అదనపు ఆదాయం కల్పించే లక్ష్యంతో తీరప్రాంతాల్లో సముద్రపు నాచు సాగు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అమృత యూనివర్సిటీ, ఐఐఎం విశాఖపట్నం, ఐఎస్‌బీ, ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ, సెంచూరియన్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు.

======================

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఆయన సొంత నియోజకవర్గమైన మంగళగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా పెద్దవడ్లపూడి గ్రామంలో 14.88 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. దాదాపు 250 క్యూసెక్కుల నీటి విడుదల పరిమాణం కలిగిన ఈ పథకం ద్వారా మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లోని 25 వేల 344 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఆ తరువాత దుగ్గిరాల మండలం పెనుమూలిలో 22 లక్షల రూపాయలతో పునర్నిర్మించిన గ్రామీణ గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. అదే విధంగా దుగ్గిరాలలో 61 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన అన్న క్యాంటీన్ నూతన భవనాన్ని కూడా మంత్రి ప్రారంభించారు.

విరామం

======================

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) ముప్పు తప్పించేందుకు 14 ఏళ్ల లోపు బాలికలకు ఉచిత హెచ్‌పీవీ టీకా పంపిణీ రాష్ట్రంలోని పది జిల్లాల్లో ఈరోజు ప్రారంభమైంది. మిగిలిన జిల్లాల్లో రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఓ ప్రకటన విడుదల చేశారు. కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, పల్నాడు, శ్రీ సత్యసాయి, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో టీకా పంపిణీ ప్రారంభం కాగా సుమారు 1,500 మందికి వాక్సినేషన్ జరిగిందని తెలిపారు. ఇక పార్వతీపురం మన్యం జిల్లాలో ఈరోజు ప్రారంభమైన హెచ్‌పీవీ టీకా పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బహిరంగ మార్కెట్‌లో ఒక్కో డోస్ ధర 4 వేల రూపాయలకు పైనే ఉన్నప్పటికీ, ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఈ టీకాలను పూర్తి ఉచితంగా అందిస్తోందన్నారు. అర్హులైన బాలికలందరూ తమ తల్లిదండ్రుల సమక్షంలో టీకా వేయించుకోవాలని సూచించారు.

(వాయిస్ 28 సెకన్లు)

======================

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'వికసిత్ భారత్ - రోజ్‌గార్ ఆజీవిక మిషన్ (గ్రామీణ)' వీబీ జీ రామ్ జీ చట్టం-2025పై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా "జన్-సంవాద్" ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు విజయనగరం కలెక్టర్ ఎం.రాంసుందర్ రెడ్డి తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో 125 రోజుల ఉపాధి కల్పనకు సంబంధించిన పోస్టర్లను, కరపత్రాలను ఆయన ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వికసిత్ భారత్-2047 దార్శనికతలో భాగంగా.. పాత ఉపాధి హామీ చట్టం స్థానంలో ఈ నూతన చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈ పథకం కేవలం ఉపాధి పనులకు మాత్రమే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత మౌలిక సదుపాయాల కల్పన, వాతావరణ మార్పులను తట్టుకునే పనులకు ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.

======================

వైఎస్ఆర్ కడప జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో ఈనెల 26 నుంచి ఏప్రిల్ 5 వరకు శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన సాయంత్రం 6 గంటల 30 నిమిషాల నుంచి 8 గంటల 30 నిమిషాల వరకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మార్చి 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమం నిర్వహిస్తారు.

======================

సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న విలేజ్ రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన వినతుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతను ఇవ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన ఛాంబర్‌లో జిల్లాలోని తహశీల్దార్లతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విలేజ్ రెవెన్యూ క్లినిక్‌కు ప్రజల నుండి వచ్చే వినతులను పరిష్కరించడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ ఫైళ్లను సకాలంలో పూర్తి చేయాలని, ముఖ్యంగా లాండ్ మ్యూటేషన్లు, సర్వే సంబంధిత పనుల్లో జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

======================

తీర ప్రాంత కర్ణాటక నుండి దక్షిణ తమిళనాడు వరకు సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయం, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని.. వీటి ఫలితంగా ఉత్తరాంధ్రలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వెల్లడించింది.

======================

విజయనగరం జిల్లాలో వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15న పునాది అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన మూల్యాంకన పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం.. 'ఉల్లాస్ - అక్షర ఆంధ్ర' కార్యక్రమం కింద నమోదైన అభ్యాసకుల కోసం ఈ పరీక్షను ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

======================

======================